సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023

నమఃశివాయ



వేములవాడ: రాజన్నను శనివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో అభిషేకాల టికెట్లను కుదించారు. అన్నపూజ సమయాన్ని ముందుకు చేశారు. ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఐ కరుణాకర్ బందోబస్తు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

బీసీలకు 60 అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల: అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో శనివారం బీసీ సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. హన్మాండ్లు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. బీసీల ఓట్లు ఎక్కువగా ఉన్నప్పుడు సీట్లు కూడా బీసీలకు ఎక్కువ కేటాయించాలని కోరారు. తెలంగాణలో బీసీల జనాభా 60 శాతం ఉందని, చట్టసభల సీట్ల కేటాయింపుల్లో 20 శాతానికి మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిడికెడు మంది అగ్రవర్ణాలు అసెంబ్లీలో ఉంటే.. గంపెడున్న బీసీ వర్గాలు రాయితీల మత్తులో ఉన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జనాభా ధామాషా ప్రకారం శాసనసభ ఎన్నికల్లో బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ బీసీలకు అసెంబ్లీ సీట్ల కేటాయింపులో పునరాలోచించాలని కోరారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగే బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు. నాయకులు వీరవేణి మల్లేశ్ యాదవ్, కంచర్ల రవిగౌడ్, బట్టు ప్రవీణ్, కమలాకర్, తిరుపతి, నవీన్, మహేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతచర్యలపై సమీక్ష



పోలీసు అధికారులతో సమావేశమైన డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: రానున్న ఎన్నికల నేపథ్యంలో వేములవాడ నియోజకవర్గంలో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై డీఎస్పీ నాగేంద్రచారి పోలీస్ అధికారులతో శనివారం సమీక్షించారు. అసాంఘిక కార్యకలాపాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం ఉండేలా తీసుకోవాల్సిన భద్రతపై పోలీస్ అధికారులు చర్చించారు. అసాంఘిక శక్తులపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో చందుర్తి, కోరుట్ల సీఐలు కిరణ్, ప్రవీణ్, కథలాపూర్, మేడిపల్లి ఎస్సైలు హాజరయ్యారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 11న నిర్వహించే శాంతియుత ధర్నాలో బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు కేసుగాని పరమేశ్వరీ కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ఏడు శాతం ఉన్న అగ్రవర్ణాల నాయకత్వం తొలగిపోవాలంటే బడుగు, బలహీనవర్గాలు ఏకం కావాలని కోరారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు పాలితులుగా కాకుండా పాలకులుగా మారాలన్నారు. గుప్పెడంతా ఉన్న వారు అసెంబ్లీకి వెళ్తుంటే 90 శాతం వరకు ఉన్న బలహీనవర్గాల ప్రజలు ఉచిత పథకాల మత్తులో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఐకమత్యంతో ముందుకెళ్తే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 11న నిర్వహించే శాంతియుత ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఎడపెల్లి బాబు, గడ్డం హరీశ్‌గౌడ్ అరుణ్, బాలరాజ్, మహేశ్, సురేష్, మధు, భాస్కర్ ఉన్నారు.

శ్మశానవాటిక తరలించాలి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్ (కేసీఆర్ నగర్) సముదాయం సమీపంలో శ్మశానవాటికను వేరే ప్రాంతానికి తరలించాలని కాలనీవాసులు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నివసించే ఆవరణలో అంత్యక్రియలకు ఆవాసం కల్పించడం సరికాదని.. కనుచూపు మేరలో కాడు కాలుతుంటే, చితి మంటల నుంచి వచ్చే పొగ ఇళ్లలోకి వస్తోందని వాపోయారు. వెంటనే శ్మశానవాటికను వేరే చోటికి మార్చాలని కోరారు.

మట్టి గణపతి భజేహం

- భక్తిభావం.. బాధ్యతాయుతం
- మట్టివిగ్రహాలనే పూజిస్తున్న భక్తులు
- అవగాహన కల్పిస్తూ.. విగ్రహాలు పంపిణీ చేస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న పర్యావరణ ప్రేమికులు
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న జనం

వినాయక నవరాత్రోత్సవాలను బాధ్యతాయుతంగా చేసుకుందామంటున్నారు పలువురు పర్యావరణ ప్రేమికులు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ) విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ పర్యావరణాన్ని కలుషితం చేయొద్దని.. మట్టి విగ్రహాలనే పూజిద్దామని అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు మట్టితో ప్రతిమలు తయారు చేయించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. పీవోపీ విగ్రహాలతో చెరువులు, కుంటలు కలుషితమై నీరు విషపూరితంగా మారుతుందని.. భవిష్యత్ తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మట్టివిగ్రహాలను పూజిద్దామని జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నాయి. ఈనెల 18 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు మొదలుకానున్నాయి.. ఈ నేపథ్యంలో జిల్లాలో మట్టివిగ్రహాలను ప్రతిష్ఠించాలని అవగాహన కల్పిస్తున్న వ్యక్తులు.. స్వచ్ఛంద సంస్థల గురించి తెలుసుకుందాం..



గతేడాది సిరిసిల్లలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడి విగ్రహం

గడపగడపకూ..



హిందూ సేవక్ సమితి మట్టి వినాయకుడు (ఫైల్)

మట్టి గణేశ్.. మా దళపతి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌కు చెందిన 20 మంది యువకులు కలిసి హిందూ సేవక్ సమితి వినాయక ఉత్సవ సమితిని ఏర్పాటు చేసుకున్నారు. వీరు గత పదేళ్లుగా వడ్లకొండ దేవదాస్ ఆధ్వర్యంలో ఏటా మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తున్నారు. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



శ్రీనిధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ(ఫైల్)

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ స్నేహితులతో కలిసి శ్రీనిధి పరస్పర సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. పదకొండేళ్లుగా 55 మంది సభ్యులతో కలిసి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి నెల సభ్యులు ఒక్కొక్కరు తమ వంతుగా రూ.100 సంఘానికి చెల్లిస్తారు. ఇలా జమయిన నిధితో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏటా శివనగర్, బీవై నగర్ ప్రాంతాలలో 1500 చొప్పున మట్టి వినాయకులు పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 15 వేల విగ్రహాలను పంపిణీ చేశారు.

విగ్రహాలు తయారు చేస్తూ..



మట్టి వినాయకుడిని తయారు చేస్తున్న శ్రీనివాస్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన ఆకునూరి శ్రీనివాస్ అనే యువకుడు ఏటా వినాయక ఉత్సవాల సమయంలో మట్టి విగ్రహాలను తయారు చేసి అందిస్తుంటాడు. పీవోపీ విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణానికి చేటు చేయొద్దనే ఉద్దేశంతో ఏటా మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలోని యువకులను సైతం మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించేలా ప్రోత్సహిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో మై వేములవాడ ట్రస్టు



మట్టి వినాయకుని ప్రతిమ అందిస్తున్న మై వేములవాడ ట్రస్ట్ ప్రతినిధి

వేములవాడ: పర్యావరణ పరిరక్షణలో తాము సైతం ముందుంటామని మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ముందుకొచ్చారు. గతేడాది నుంచి మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గతేడాది 1100 మట్టితో చేసిన ప్రతిమలను పంపిణీ చేశారు. ఈసారి దాతల సహకారంతో 2వేల ప్రతిమలు పంపిణీ చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి మధు మహేశ్ తెలిపారు.



మట్టి గణపతులను అందజేస్తున్న మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భాస్కర్(ఫైల్)

పర్యావరణంపై బాధ్యతగా..

సిరిసిల్లటౌన్: మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించడమే మన సంప్రదాయమని మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ ప్రచారం చేస్తున్నారు. సిరిసిల్లకు చెందిన మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోదావరి పాలిమర్స్, సంతోష్ ఎలక్ట్రికల్ ప్రతినిధులు ఐదేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఏటా సిరిసిల్ల కోర్టు ఎదుట వెయ్యి నుంచి 2 వేల విగ్రహాల వరకు ఉచితంగా అందిస్తున్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భాస్కర్ నేతృత్వంలో ఏటా వినాయక నిమజ్జన వేడుకల్లో భక్తులకు, ఉత్సవ నిర్వాహకులకు నీళ్లు, చల్లా ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ విగ్రహాలను స్థానిక కుమ్మరి కళాకారులకు ఆర్డర్లు ఇస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నారు.



గతేడాది శివాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి (ఫైల్)

పన్నెండేళ్లుగా మట్టి ప్రతిమనే..

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రంలోని శివాలయంలో గత పన్నెండేళ్లుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ ఆలయ భక్త బృందం ఆదర్శంగా నిలుస్తున్నారు. గత కొన్నాళ్లుగా మట్టి విగ్రహాలను తయారు చేయించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వినాయక నిమజ్జనం రోజు డీజేల హడావుడి లేకుండా భజన పాటలతో ర్యాలీగా వెళ్తారు. ఉత్సవ నిర్వాహకుడు శ్రీపతి శ్రీనివాస్ మాట్లాడుతూ మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామన్నారు. ఏటా శివాలయంలో ప్రత్యేకంగా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు చేసుకోవాలి

- గణేశ్ నవరాత్రులు, మిలాద్ ఉల్ నబీకి ప్రత్యేక బందోబస్తు
- ఎస్పీ అఖిల్ మహాజన్



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: గణేశ్ నవరాత్రోత్సవాలు, మిలాద్ ఉన్ నబీలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం వేములవాడ టౌన్, రూరల్ పరిధిలోని గణేశ్ మండళ్ల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. హిందూ, ముస్లింలకు పవిత్రమైన గణేశ్ చతుర్థి, మిలాద్ ఉన్ నబీ పండుగలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. మండపం షెడ్ నిర్మాణం, నాణ్యత, కరెంట్ సరఫరా, సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులకు ఇబ్బందుల కలుగకుండా రోడ్లపైనే మండపాలు ఏర్పాటు చేసుకోవద్దన్నారు. మండపాలను పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్ సిబ్బంది తరచూ తనిఖీ చేస్తారని తెలిపారు. మండపాల్లో, నిమజ్జనం రోజున డీజేలకు అనుమతిలేదని స్పష్టం చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, వేములవాడరూరల్ ఎస్సై మారుతి, టౌన్ ఎస్సైలు రమేశ్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి



కాళోజీ చిత్ర పటం వద్ద రచయితల నివాళి

సిరిసిల్లకల్చరల్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు 110వ జయంతిని జిల్లా రచయితల సంఘం శనివారం ఘనంగా నిర్వహించింది. గాంధీసర్కిల్‌లో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించింది. ఈ సందర్భంగా అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ పరిరక్షణకే ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. ధిక్కార స్వరంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రతినిధులు ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, కామారపు శ్రీనివాస్, కుడిక్యాల మహేశ్, వెంగల లక్ష్మణ్, గణేశ్, వేముల మార్కండేయులు పాల్గొన్నారు.

15న మెడికల్ కాలేజీ ప్రారంభం

- అదే రోజు బీఆర్ఎస్ బహిరంగ సభ
- బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 15న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని తొమ్మిది మెడికల్ కాలేజీలను ఏకకాలంలో ప్రారంభిస్తారని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. అదే రోజు సిరిసిల్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించాలని, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పే సభను భారీగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు పార్టీ శ్రేణులకు సంకేతాలిచ్చారు. మెడికల్ కాలేజీ వద్దనే బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 20 వేల మందితో భారీ సభను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మరోసారి ప్రజలతో మమేకమే లక్ష్యంగా..

మెడికల్ కాలేజీతో జిల్లాలో ప్రజా ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో వివరించడంతోపాటు జిల్లాలో సాధించిన సాగునీటి ప్రగతి, పెరిగిన సాగు విస్తీర్ణం, విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా, నేతన్నలకు బీమా, వర్కర్ టు ఓనర్ పథకం వంటి వాటిపై ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వర్గాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజలతో మమేకం కావడమే లక్ష్యంగా వచ్చిన వారికి భోజన వసతి కల్పించాలని, మంచినీటి వసతి కల్పించాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా బహిరంగ సభను భారీగా నిర్వహించాలని మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిసింది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతో పాటు, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజలను, పార్టీ ముఖ్యనేతలను, ప్రజాప్రతినిధులన సమీకరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలతో మంత్రి కేటీఆర్ శుక్రవారం చర్చించినట్లు తెలిసింది.



సిరిసిల్ల మెడికల్ కాలేజీ భవనం

కేసుల సత్వర పరిష్కారానికి అదాలత్

- అదాలత్‌లో తీర్పు అంతిమం
- జిల్లా జడ్జి ప్రేమలత



కోర్టులో జాతీయ అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్న కేసుల సత్వర పరిష్కారమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. సిరిసిల్ల కోర్టుహాలులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మాట్లాడారు. అదాలత్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఇక్కడ రాజీపడితే కలిగే లాభాలు వివరించాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల హక్కుల రక్షణకు గల చట్టాల గురించి వివరించాలని సూచించారు. అదాలత్‌లో తీర్పు అంతిమమని పైకోర్టుకు అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చిన్నారులకు సూచించారు.

2019 కేసులు పరిష్కారం

సిరిసిల్ల, వేములవాడల్లోని కోర్టు కాంప్లెక్సుల్లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లలో మొత్తం 2,019 కేసులు నమోదయ్యాయి. వివిధ బ్యాంకులు, ప్రమాద బీమా తదితరాల కేసుల్లో రూ.41,93,173 విలువైన లావాదేవీలు సెటిల్ అయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయ సేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో 513 కేసులు పరిష్కారం

వేములవాడ: రాజీయే రాజమార్గమని.. చిన్నపాటి తగాదాలతో సమయం వృథా చేసుకోవద్దని వేములవాడ సబ్ జడ్జి సట్టు రవీందర్ పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా శనివారం వేములవాడ కోర్టులో 513 కేసులు పరిష్కారమయ్యాయి. సబ్ జడ్జి రవీందర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రశాంతమైన జీవితం గడపాలని కోరారు. ఏపీపీ పెద్ది విక్రాంత్, ఏజీపీ గుడిసె సదానందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, కార్యదర్శి నక్క దివాకర్, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమలగౌడ్, నాగుల సత్యనారాయణ, న్యాయవాదులు పొత్తూరి అనిల్‌కుమార్, గుండ రవి, రేగుల దేవేందర్, పార్లపెల్లి అంజయ్య, నాగుల సంపత్, బొడ్డు ప్రశాంత్, గంగరాజు, నవీన్, అనిల్, అభిలాశ్, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ జడ్జి సట్టు రవీందర్

ఎల్‌ఎండీకి నీటి విడుదల



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 3,040 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి 4,500 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. ప్రాజెక్టులో 20.10 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

సమ్మెకు దూరంగా ఉండండి

సిరిసిల్లకల్చరల్: సంక్షేమ రంగంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తూ సమ్మెకు దూరంగా ఉండాలని అంగన్‌వాడీలకు మహిళా శిశు సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. అంగన్‌వాడీలకు వేతనాల పెంపుతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్ టీచర్లకు లక్ష, ఆయాలకు రూ.50వేల వరకు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. బయోమెట్రిక్ విధానంలో సరుకుల సరఫరా చేస్తూనే అన్ని రకాల బిల్లులను ఆన్‌లైన్ విధానంలో చెల్లిస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. యూనిఫామ్‌లు, మొబైల్‌ఫోన్లు, ఇంటర్నెట్ డేటాను అందించామని వివరించారు. ఈమేరకు జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం అంగన్‌వాడీలకు వివరించారు. సీడీపీవో ఆనందిని, ఎల్లయ్య, ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

క్లుప్తంగా

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని రామన్నపేట మహిళా సంఘం భవన నిర్మాణం పనులకు రూ.4 లక్షల ప్రొసీడింగ్ కాపీని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా రామన్నపేటకు చెందిన సుమారు 50 మంది బీజేపీ చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు కన్నం మధు, ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ మిట్టపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు సంబ లక్ష్మీరాజం, సంపత్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, సలీం, సతీశ్, రాజు ఉన్నారు.

నంబర్‌ప్లేట్‌పై స్టిక్కర్ అతికించిన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: నంబర్ కనిపించకుండా స్టిక్కర్ అతికించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ శనివారం తెలిపారు. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన కంకనాల వేణు కొన్ని రోజులుగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన సమయాలలో పోలీసు చలాన్ల తప్పించుకునేందుకు తన మోటార్ సైకిల్ నంబర్ కనిపించకుండా వెనుక నంబర్‌ప్లేటుపై స్టిక్కర్ అతికించాడు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో పోలీసులు పట్టుకొని చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎవరైన నంబర్ కనిపించకుండా స్టిక్కర్లు అతికిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోలీసుల పేరిట వసూళ్లు

సిరిసిల్లక్రైం: బైక్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి ప్రయత్నించి.. పోలీసుల పేరిట డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెడ్డివాడకు చెందిన గుడెల్లి సంతోష్ కొడుకు ప్రజ్ఞేశ్ ఓఎల్ఎక్స్‌లో బైక్‌ను కొనేందుకు ప్రయత్నించాడు. దీని గురించి ఆకాశ్ అనే వ్యక్తిని వివరాలు అడిగాడు. ప్రజ్ఞేష్ టెన్త్ విద్యార్థి కావడం బైక్ నడపడం రాదన్న విషయాన్ని గమనించిన ఆకాశ్ బైక్ కొనుగోలు కోసం రూ.20 వేలు తీసుకుని తనే ఇంటికి తీసుకొస్తానని నమ్మబలికాడు. బైక్‌ను తీసుకొచ్చే సమయంలో పోలీసులు తీసుకెళ్లారని ఆకాశ్ నమ్మబలికాడు. ఓఎల్ఎక్స్‌లో బైక్ కొనడంపై కేసు పెడతామని బెదిరించారని, కేసు తీసేయడానికి డబ్బులు అడిగారని కట్టుకథ చెప్పి రూ.40 వేలు కావాలని అడిగాడు. దీనిపై ప్రజ్ఞేష్ తండ్రి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆకాశ్‌పై కేసు నమోదు చేశారు.

జాతర గ్రౌండ్‌లో అగ్ని ప్రమాదం



వేములవాడ: స్థానిక జాతర గ్రౌండ్‌లోని రాజన్న ఆలయానికి చెందిన కొబ్బరికాయల దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. కొబ్బరిచిప్పలను నిల్వ ఉంచిన దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్పందించిన స్థానికులు మంటలను ఆర్పి వేశారు.

పల్లెచిత్రాల 'తోట'



- వైకుంఠం గీసిన చిత్రాలకు క్రేజీ
- వేలం పాటలో కోటిన్నర పలికిన ధైనం
- ఆకట్టుకుంటున్న బూర్గుపల్లి వైకుంఠం కళాఖండాలు
- ఎన్నో అవార్డులు.. మరెన్నో పురస్కారాలు



చిత్రం గీస్తున్న వైకుంఠం

బోయినపల్లి(చొప్పదండి): పల్లె జీవనం.. పడచుల కట్టుబొట్టు.. భారతీయ సంస్కృతి.. ఆయన చిత్రాలకు మూలాధారం. తోట వైకుంఠం కుంచె పడితే చిత్రాలకు జీవం వచ్చి, కాన్వాస్‌పై నాట్యం చేస్తాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం బూర్గుపల్లిలో జన్మించిన వైకుంఠం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఏడేళ్ల క్రితం గీసిన చిత్రానికి ఇటీవల ముంబయిలోని ఆస్తాగురు యాక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో రూ.1,41,35,220 ధర పలకడం విశేషం.

బూర్గుపల్లిలో విద్యాభ్యాసం

బూర్గుపల్లిలో 1942లో జన్మించిన తోట వైకుంఠం స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. బోయినపల్లి, శాత్రాజీపల్లి, వేములవాడ, సిరిసిల్లలో ఉన్నత విద్య చదివారు. హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనం పూర్తి చేశారు. అనంతరం మహారాజ సయాజీరావు యూనివర్సిటీ ఆఫ్ బరోడాలో ప్రముఖ చిత్రకళాకారుడు సుబ్రమణియన్ దగ్గర శిష్యరికం చేశారు.

రంగుల ఆయన ప్రత్యేకత

డస్కీస్కిన్‌తో మహిళల చిత్రాలు గీయడం ఆయన ప్రత్యేకత. సాదాగా కనిపించే మహిళలు రూపం ఆయన చిత్రంగా మలిస్తే అందంగా కనిపిస్తారు. ఆయన గీసిన అందమైన మహిళల చిత్రాలను సిరిసిల్ల చీరెలుగా అభివర్ణిస్తారు.

అమ్మ.. మహిళలే స్ఫూర్తి

చిత్రకారుడిగా గుర్తింపు పొందడానికి అమ్మ స్ఫూర్తి అని వైకుంఠం చెబుతుంటారు. చిన్నప్పుడు గ్రామంలో చిందు కళాకారులు నాటకాలు ప్రదర్శిస్తుంటే వారు వేసిన వేశాలకు తగినట్లుగా మేకప్ వేసి రంగులు దిద్దే అలవాటు ఉండేదని తెలిపారు. అలా చిన్నప్పటి నుంచే రంగులు, బొమ్మలు గీయడంపై అనురక్తి కల్గిందని చెబుతుంటారు. ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులు తనకు ఇష్టమని.. తన చిత్రాలలోనూ ఎక్కువగా వాటినే వాడుతానని తెలిపారు.

ఎన్నో అవార్డులు

భోపాల్‌లో రెండేళ్లకోసారి ఇచ్చే భారత్ భవన్ అవార్డుతోపాటు భారత ప్రభుత్వం అందించే జాతీయ అవార్డు, ఉమ్మడి రాష్ట్రంలో హంస అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ చిత్రకళాకారుడిగా అవార్డు లభించింది. దాసి, మాభూమి చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిశారు. దాసి చిత్రానికి ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్‌గా జాతీయ అవార్డు అందుకున్నారు.

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు

వైకుంఠంపై పలు డాక్యుమెంటరీలు వచ్చాయి. 2015లో కోల్‌కతాకు చెందిన పార్థురాయ్ డాక్యుమెంటరీ నిర్మించారు.

గ్రామాభివృద్ధికి విరాళాలు

స్వగ్రామం బూర్గుపల్లిలో పాఠశాల అభివృద్ధికి రూ.40 వేలు విరాళంగా అందించారు. యువత చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని తెలుపుతున్నారు.

మాకు గర్వంగా ఉంది



అంతర్జాతీయ చిత్రాకారుడిగా పేరు పొందిన తోట వైకుంఠం మా గ్రామస్తుడని చెప్పుకోవడం గర్వంగా ఉంది. ఆయనతో మా గ్రామానికి పేరు రావడం గొప్పగా భావిస్తున్నాం. ముంబయిలో జరిగిన వేలంలో ఆయన గీసిన చిత్రానికి కోటిన్నర పలకడం చాలా సంతోషంగా ఉంది.

– కమటం అంజయ్య,మాజీ సర్పంచ్, బూర్గుపల్లి

చిందు నాటకాలు ఇష్టపడేవారు



వైకుంఠం సారు చిన్నప్పుడు మా గ్రామంలో చిందునాటకాలు వేసేవారు. పదేళ్ల కింద గ్రామానికి వచ్చినప్పుడు పాతతరం చిందు కళాకారులతో వేశాలు వేయించి డాక్యుమెంటరీ తీశారు. చిందుకళను ఇష్టపడేవారు.

– గజ్జెల సాయిలు,చిందు కళాకారుడు

గ్రామాభివృద్ధికి తోడ్పాటు



తోట వైకుంఠం గ్రామంలో యువతకు స్ఫూర్తినిచ్చే వ్యక్తి. స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధికి గతంలో రూ.40 వేలు సాయం చేశారు. ఆయన గీసిన చిత్రాలతో మా ఊరికి పేరు రావడం గర్వంగా ఉంది.

– పెరుక మహేశ్, యువకుడు

రాజన్న సేవలో 'సాక్షి' డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి



వేములవాడ: రాజన్నను 'సాక్షి' డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, పర్యవేక్షకులు తిరుపతిరావు ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.

వేములవాడ టికెట్ నాకే ఇవ్వండి

- 42 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



దరఖాస్తు అందజేస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: అధికారంలో ఉన్నా.. లేకున్నా.. పార్టీ కోసం గత 42 ఏళ్లుగా పనిచేస్తున్న తనకే వేములవాడ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శనివారం హైదరాబాద్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇతర పార్టీలు ఆదిపత్యం చెలాయించాయని, పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న తనకు ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని విన్నవించారు. నాయకులు రేగుల మల్లికార్జున్, మార్త సత్తయ్య, బండ మల్లేశం, గోపు బాలరాజు, రేగుల సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి, ముంజ శ్రీనివాస్, రాకేష్, వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్, నంటి మహేశ్, కిష్టస్వామి, బాలాజీ ప్రభాకర్ పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటం



ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో నిరసనలు కొనసాగుతున్నాయి. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు శనివారం ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలిపారు. నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యుం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేష్, వెంకటస్వామి, ఉపేందర్ ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలపై సర్కారు శీతకన్ను

ఎన్‌హెచ్‌ఎం స్కీం వర్కర్లు చేస్తున్న నిరవధిక రిలే దీక్షలు శనివారం కొనసాగాయి. సీపీఐ రాష్ట్ర నాయకుడు సామల మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వంస్పందించి వారి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. పి.రాణి, గిరిధర్, శ్వేత, ఫాజల్, ప్రవీణ్, సునంద, ఫర్వీన్, వనిత, వెంకటేశ్, బాలకృష్ణ, లలితమ్మ, రాజమణి, శేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాజీ సర్పంచుల దీక్షలు

తమ సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 32వ రోజుకు చేరాయి. మంత్రి కేటీఆర్ స్పందించాలని కోరారు. దీక్షల్లో బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, గోవర్ధన్, సత్యనారాయణరెడ్డి, పైలూరి రాజమల్లు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక యువతి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణమా ?
- మర్రిగడ్డలో పోస్టు ఉమెన్‌గా విధులు



ధనూజ(ఫైల్)



మృతదేహాన్ని చూసేందుకు తరలివచ్చిన బంధువులు, గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): ఒంటరితనం భరించలేక యువతి తనువు చాలించిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గూడెంకు చెందిన నూనె ధనూజ(21) రెండు నెలల క్రితం బ్రాంచ్ పోస్టు ఉమెన్‌గా ఉద్యోగం సాధించింది. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా చందుర్తి మండలం మర్రిగడ్డకు వచ్చింది. రెండు నెలలుగా మర్రిగడ్డలో అద్దె ఇంట్లో ఉంటూ విధులు నిర్వర్తిస్తుంది. ఈక్రమంలో వరుసకు బావ అయిన రాకేశ్‌ను ప్రేమిస్తుంది. ఒంటరితనంతో బాధపడుతున్నానని రాకేశ్‌తో చెప్పుకోగా.. ఉద్యోగానికి రాజీనామా చేసి రమ్మనడంతో గత నెల 31న రాజీనామా పత్రాన్ని సమర్పించింది. రెండు రోజులగా స్థానికంగా లేని ధనూజ శుక్రవారం మర్రిగడ్డలో అద్దెకుంటున్న ఇంటికి సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చింది. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతూనే తల తిప్పుతుందని చెప్పి ఫోన్ కట్ చేసింది. వెంటనే రాకేశ్ మర్రిగడ్డలోని తెలిసిన వ్యక్తులకు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. శనివారం తెల్లవారుజామున మర్రిగడ్డకు చెందిన మరొక వ్యక్తికి రాకేశ్ ఫోన్ చేసి ధనూజ ఇంటికెళ్లి చూసి రావాలని కోరాడు. సదరు వ్యక్తి వెళ్లి పిలువగా గదిలో నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇంటి పైకప్పు ఎక్కి చూడగా ఉరివేసుకొని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి నూనె మమత ప్రేమ వ్యవహారమే తన కూతురు మరణానికి కారణమని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లక్ష ప్రైవేటు టీచర్లతో సభ

- కేంద్రం కన్సల్టెంట్ ఫీజు చెల్లించాలి
- ప్రైవేటు టీచర్లకు సంక్షేమచట్టం అవసరం
- క్వాలిటీ ఎడ్యుకేషన్ దిశగా అడుగులేయాలి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ట్రస్మా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రైవేటు టీచర్ల బతుకులు బాగుపడాలి.. వారి సంక్షేమానికి ప్రత్యేక చట్టం రావాలి.. ఇందుకు హైదరాబాద్‌లో లక్షమందితో సభ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో శనివారం జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైవేటు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినోద్‌కుమార్ మాట్లాడారు. కేంద్రం ప్రైవేటు టీచర్ల కోసం కన్సల్టెంట్ ఫండ్ కేటాయించాలని కోరారు. పోటీ ప్రపంచంలో టెక్నాలజీని వినియోగించుకుంటూ క్వాలిటీ ఎడ్యుకేషన్ దిశగా అడుగులు వేయాలని సూచించారు. సీఈఎస్ఎఫ్ స్కీంలో రూ.300లతో పేరు నమోదు చేస్తే.. ఎలాంటి మరణం సంభవించినా రూ.6లక్షల బీమా వస్తుందని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఒక విజన్‌తో పనిచేసుకోవాలని సూచించారు.

సగం నిధులు ఇవ్వండి సార్

ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సార్ గురుకుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.79వేల వరకు ఖర్చు చేస్తుంది.. అందులోంచి సగం నిధులు మాకు ఇప్పించాలని వినోద్‌కుమార్‌ను కోరారు. ప్రభుత్వం నుంచి కొంత సాయం అందితే టీచర్లకు మంచి వేతనాలు ఇవ్వడంతోపాటు విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ కరెస్పాండెంట్లను సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కార్యదర్శి రవీందర్, కోశాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పేదల మధ్యనే పుట్టిన రోజు వేడుకలు



పేదల మధ్యలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న దిలీప్ కుటుంబ సభ్యులు

వేములవాడ: పుట్టిన రోజు వేడుకలను పేదల మధ్య చేసుకొని.. వారికి అన్నదానం చేశారు పట్టణానికి చెందిన దిలీప్. మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో అల్వాల్‌కు చెందిన గాయత్రీదేవి, ఎల్లారెడ్డిపేటకు గంట సారిక-నవీన్‌కుమార్‌గౌడ్, వేములవాడకు చెందిన మామిండ్ల సరిత-వెంకటేశ్, రాజన్న ఆలయ ఉద్యోగి నక్క తిరుపతి దంపతులు, ఇందూరి అరవింద్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, నాగుల చంద్రశేఖర్, తాళ్లపల్లి ప్రశాంత్, మల్లేశం, పొలాస రాజేందర్, గొండ ప్రసాద్, నంది సాయికుమార్, కళా అశోక్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలో ఆగస్టు 25న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటనలోని నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ నాగేంద్రచారి శనివారం వివరాలు వెల్లడించారు. వేములవాడ మండలం చంద్రగిరికి చెందిన పల్లెపు రాజు, పల్లెపు పర్శరాములు కొంతకాలంగా జల్సాలకు బానిసయ్యారు. పని చేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. రాజుకు బావ అయిన నర్సింహులు బైక్‌ను ఆగస్టు 24న తీసుకున్నారు. మరుసటి రోజు మండలంలోని మామిడిపల్లికి వచ్చి రామాలయం పరిసరాలలోని పొలంలో పనిచేస్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. సీసీ కెమెరాల ఆధారంగా రాజు భార్య సరోజ కిరాయికి ఉంటున్న వేములవాడలోని ఓ ఇంట్లో పట్టుకున్నారు. పల్లెపు రాజు, పల్లెపు పర్శరాములుకు సహకరించిన రాజు భార్య సరోజపై కేసు నమోదు చేశారు. రాజు, పర్శరాములును రిమాండ్‌కు పంపారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఉన్నారు. నిందితులను పట్టుకొనుటలో కృషి చేసిన కానిస్టేబుళ్లు సతీశ్, నరేశ్, విశాల్, రవి, గణేష్‌లను డీఎస్పీ అభినందించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వానికి ప్రజలకు వారధులైన తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 11 నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మె పోస్టర్లను శనివారం ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జి టేకుమల్ల సమ్మయ్య ఆవిష్కరించారు. కార్మికభవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అంగన్‌వాడీలు ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణరావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ఆవునూరి శివ కుటుంబానికి జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు అండగా నిలిచారు. శివ మృతితో అతని భార్య స్రవంతి, కుమారుడు అనాథలయ్యారు. వీరి దీన స్థితిని తెలుసుకున్న జెడ్పీటీసీ లక్ష్మణరావు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. శ్రావణికి ఏదేని ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మీనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు అందె సుభాష్, గూళ్లపెల్లి నర్సింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు నిమ్మ మల్లారెడ్డి, ఆవునూర్ రామస్వామి ఉన్నారు.

సిరిసిల్ల అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



దరఖాస్తు అందిస్తున్న రాజేశంగుప్తా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ సీనియర్ నేత ఎల్లారెడ్డిపేటకు చెందిన రాజేశంగుప్తా కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం దరఖాస్తు అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మానుక కుమార్‌యాదవ్ ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా వాలీబాల్ క్రీడాకారులకు మండలంలోని దుమాల సర్పంచ్ కదిరే రజిత-శ్రీనివాస్‌గౌడ్ క్రీడాదుస్తులు అందించారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు శనివారం వెళ్లారు. ఉపసర్పంచ్ రేండ్ల హనుమంతు, నాయకులు గుంటి సుదర్శన్, బద్దిపడిగె మాధవరెడ్డి, రామిండ్ల సూర్యం, బద్దిపడిగె బాపురెడ్డి, అంకం వెంకటేశ్, కొండ రాజు, పొన్నం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.